

జిల్లా ఎమ్మెల్యేలకు..
జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవికి అర్హత లేదా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి ప్రశ్నించారు.
- 8లో ▸



ప్రజావాణికి 135 ఫిర్యాదులు
కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 135 ఫిర్యాదులు అందాయి.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
41.0 /20.4

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవానికి అమిత్ షా



సుభాష్‌నగర్: జిల్లాకేంద్రంలో జూన్ చివరి వారంలో నిర్వహించే జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వస్తున్నట్లు నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు. ఈమేరకు సోమవారం ఢిల్లీలోని తన కార్యాలయంలో షాను ఎంపీతోపాటు పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. తమ ఆహ్వానాన్ని అమిత్ షా మనస్ఫూర్తిగా అంగీకరించారని, ప్రారంభోత్సవ కార్యక్రమంలోనే జాతీయ పసుపు బోర్డు అధికారిక లోగోను కూడా ఆయన ఆవిష్కరిస్తారని ఎంపీ పేర్కొన్నారు. పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ప్రారంభ తేదీ, సమయాన్ని త్వరలో తెలియజేస్తామని అన్నారు.

అండర్ 19 క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌కు ఎంపిక



నిజామాబాద్ నాగారం: నగరంలోని జీజీ కళాశాల మైదానంలో సోమవారం నిజామాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 19 క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 70 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. లీగ్ టోర్నమెంట్ నిర్వహించి అందులో ప్రతిభ చూపినవారిని ఇంటర్ డిస్టిక్ టోర్నమెంట్‌కు 15 మందితో కూడిన తుది జట్టుగా ఎంపిక చేస్తామన్నారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, వెంకటరెడ్డి, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులు.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- విరిగిపడిన చెట్ల కొమ్మలు

సుభాష్‌నగర్: జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు గంటపాటు వర్షపు, ఈదురుగాలులకు జిల్లా కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నగరంలోని పలుచోట్ల చెట్ల కొమ్మలు, చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో సరఫరా నిలిచిపోయింది. జిల్లా వ్యాప్తంగా 15 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ప్రాథమికంగా సమాచారం అందిందని ఎస్ఈ రవీందర్ తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి కారణాలను తెలుసుకొని ఎప్పటికప్పుడు సరిచేసేందుకు సంస్థ సిబ్బంది రంగంలో దిగినట్లు పేర్కొన్నారు. చెట్ల కొమ్ములు విరిగిపడడం కారణంగా నగరంలో 33 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా సరఫరా నిలిచిపోయిందని ఆయన తెలిపారు. విద్యుత్ సిబ్బంది భద్రత పరికరాలను వినియోగిస్తూ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు.



డీసీఎంఎస్‌లో అక్రమాలు!

- వరుసగా వస్తున్న ఫిర్యాదులు
- మాజీ డీసీవో అక్రమాలను కప్పిపుచ్చినట్లు ఆరోపణలు
- గతంలోనే మంత్రి తుమ్మల విచారణకు ఆదేశించినప్పటికీ పట్టించుకోని యంత్రాంగం
- విచారణ అధికారులు సైతం కుమ్మక్కవుతున్నారంటూ విమర్శలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలో ఇద్దరు మాజీ చైర్మన్ల సహకారంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు పోరాటానికి దిగారు. మాజీ చైర్మన్ల సహకారంతో మేనేజర్ నాగేష్, క్యాషియర్ ఆనంద్ రూ.2 కోట్ల మేర అక్రమాలకు పాల్పడినట్లు తాజాగా గత నెల 19న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వి ప్రభాకర్, సావెల గంగాధర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరు గతంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సైతం ఫిర్యాదులు చేశారు. అక్రమాలపై విచారణ జరిపి సొమ్మును రికవరీ చేయాలని మంత్రి తుమ్మల 2024 నవంబర్ 2న ఉన్నతాధికారులను ఆదేశించారు. అయితే అంతకంటే ముందే అవకతవకలు, అక్రమాలపై అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశిస్తే అప్పటి జిల్లా సహకార అధికారి సింహాచలం అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ ముడుపులు తీసుకుని ఫైల్‌ను తొక్కిపెట్టినట్లు ఆరోపిస్తున్నారు. డీసీఎంఎస్ ద్వారా వివిధ వస్తువుల కొనుగోలు విషయంలో డీలర్ల వద్ద నుంచి అక్రమ పద్ధతిలో ఇన్వాయిస్‌లు తీసుకోవడంతో పాటు, కాంటాల మరమ్మతుల పేరిట దొంగలెక్కలు రాసి భారీగా బొక్కేసినట్లు పేర్కొన్నారు. మరోవైపు 2023 శాసనసభ ఎన్నికల్లో సంఘం డబ్బులను ఎన్నికల ఖర్చు కోసం విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

■ ఇదిలా ఉండగా గతంలో క్యాషియర్ ఆనంద్ కామారెడ్డి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన విషయమై అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారు.

తూతూమంత్రంగా విచారణ..

అక్రమ వ్యవహారాలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రస్తుత జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మరోసారి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా వెళ్లిన అధికారి తూతూమంత్రంగా విచారణ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులతోనే చర్చించి అన్ని వివరాలు వాళ్లకు చెప్పి కుమ్మక్కవుతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, మంత్రులు తుమ్మల, జూపల్లి ప్రత్యేక దృష్టి సారించి అక్రమాలను నిగ్గుతేల్చి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అయితే ఆనంద్ కేవలం నెలరోజుల్లోనే తిరిగి విధుల్లో చేరాడు. పైగా ఏకంగా రెండు ఇంక్రిమెంట్లు సైతం పొందడం గమనార్హం. ఆనంద్ పాలకవర్గంలోని కొందరికి డబ్బులిచ్చి సస్పెన్షన్ ఎత్తేయించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోకుండా పాలకవర్గం అడ్డుపడడమేమిటనే విమర్శలు వస్తున్నాయి. సహకార సంఘాల చట్టం 51, 52 మేరకు విచారణ పారదర్శకంగా చేపట్టి శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుని నిధులు రికవరీ చేయాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఎకో టూరిజానికి రూ.1.4 కోట్లు

- నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- రానున్న మూడు సఫారీ వాహనాలు
- పనుల ప్రారంభమే ఆలస్యం..



ఇటీవల నిర్మల్ నుంచి తెప్పించిన సఫారీ వాహనం (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఎకో టూరిజం ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. ఎన్నో పర్యాయాల సర్వేల అనంతరం ప్రభుత్వం రూ.1.4కోట్ల నిధులు కేటాయించింది. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. బాల్కొండ మండలం జలాల్‌పూర్, డొంకేశ్వర్ మండలం గాదేపల్లి (చిన్నయానం), నందిపేట్ మండలం ఉమ్మెడలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాల్లో ఎకో టూరిజం ఏర్పాటు కానుంది. మంజూరైన నిధులతో ముందుగా వాచ్‌టవర్లు, కాటేజీలు, రెస్టారెంట్లు, వాహనాల పార్కింగ్, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టేందుకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అయితే గాదేపల్లిలో స్థల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. వాచ్ టవర్లు, రిసార్టుల నిర్మాణానికి స్థలం ఇచ్చేందుకు గ్రామస్తులు నిరాకరిస్తున్నారు. దీనికి ఉన్నతాధికారులే పరిష్కారం చూపాల్సి ఉంది.

ఎట్టకేలకు సఫారీ వాహనాలు

ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో విదేశీ పక్షులు, జింకలు, ప్రకృతిని వీక్షించేందుకు సఫారీ వాహనాలు రానున్నాయి. సఫారీ వాహనాలు లేక నిర్మల్ జిల్లా నుంచి ప్రతిసారి తెప్పించడం కష్టంగా మారింది. దీంతో అటవీ శాఖ ప్రతిపాదన మేరకు జిల్లాకు మూడు సఫారీ వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. వీటి కొనుగోలుకు ఒక్కో దానికి రూ.15 లక్షలు మంజూరు చేసింది. సఫారీ వాహనాలను తమ పర్యటనకే కాకుండా పర్యాటకుల కోసం కూడా ఉపయోగించాలని అధికారులు భావిస్తున్నారు. అదే విధంగా బోటింగ్ కోసం అవసరమైన పనులను పరిశీలిస్తున్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

మొలకెత్తని వరి విత్తనాలు

నిజామాబాద్ రూరల్: సహకార సొసైటీలో తీసుకున్న సన్నరకం వరి విత్తనాలు మొలకెత్తకపోవడంతో మండలంలోని కేశాపూర్ గ్రామానికి చెందిన రైతులు గ్రామ సచివాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. మాధవనగర్ ప్రాథమిక సహకార సొసైటీలో సుమారు 18 మంది మిమి వరి విత్తనాలు కొనుగోలు చేసి నారుమడిలో అలికామని, ఐదు ఎకరాలకు రావాల్సిన నారు రెండు ఎకరాలకు కూడా వచ్చే పరిస్థితి లేదని, విత్తనాలు సరిగా మొలకెత్తలేవని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న మండల వ్యవసాయ అధికారిణి జాదవ్ హీరా, మాధవ నగర్ సహకార సొసైటీ సీఈవో, ఫీల్డ్ అధికారి కేశాపూర్ గ్రామానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. మళ్లీ విత్తన సంచులు ఇస్తామని వారిని సముదాయించడంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే దీనిపై వ్యవసాయ అధికారిణి వివరణ కోరగా.. స్పష్టత ఇవ్వలేదు. సొసైటీ సీఈవో మాత్రం ఒకరిద్దరు రైతులు మాత్రమే తమ వద్ద విత్తనాలు తీసుకున్నారని తెలిపారు.



కేశాపూర్‌లో మొలకెత్తని వరి విత్తనాలు

భారీ అగ్ని ప్రమాదం

● రూ. కోటి ఆస్తి నష్టం ● వర్నిలో ఘటన



భవనం నుంచి వ్యాపిస్తున్న దట్టమైన పొగలు

వర్ని: మండల కేంద్రంలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామ శివారులో ఉన్న శ్రీ శక్తి ఎంటర్‌ప్రైజెస్‌లో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని గోడౌన్ పూర్తిగా దగ్ధమైంది. కూనిపూర్ క్యాంపునకు చెందిన కంటిపూడి రామకృష్ణ ఎనిమిది నెలల క్రితం సొంత భవనంలో ఎంటర్‌ప్రైజెస్ ప్రారంభించారు. ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, స్టీల్, ఎలక్ట్రానిక్ తదితర సామగ్రికి ఉత్తర తెలంగాణ డీలర్‌గా ఉంటూ ఎంటర్‌ప్రైజెస్ నిర్వహిస్తున్నాడు. అగ్నిప్రమాదంలో వస్తువులతో పాటు భవనం పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న బోధన్ ,బాన్సువాడ, నిజామాబాద్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అగ్ని ప్రమాదంతో రూ. కోటి విలువజేసే ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రామకృష్ణ తెలిపారు.

ఎస్సారెస్పీలో 13 టీఎంసీల నీరు

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద వచ్చి చేరుతుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతంలో 13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 1679 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. కాకతీయ కాలువ ద్వారా 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 341 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1062.5(13 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

గతేడాదితో పోలిస్తే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుత సంవత్సరం గతేడాదితో పోలిస్తే 5.5 టీఎంసీల నీటి నిల్వ ఎక్కువగా ఉంది. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా 1.5 టీఎంసీల ఇన్‌ఫ్లో రాగా.. ఈ నెలలో 0.5 టీఎంసీల ఇన్‌ఫ్లో వచ్చినట్లు ప్రాజెక్ట్ అధికారుల రికార్డులు తెలుపుతున్నాయి. గతేడాది ఇదే రోజున 7.5 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. ఈ ఏడాది 13 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ప్రతి విద్యార్థికి యూనిఫామ్ అందించాలి

- పండగ వాతావరణంలో స్కూళ్లను ప్రారంభించాలి
- పాఠశాలల పరిసరాలను శుభ్రం చేయించాలి
- యుద్ధ ప్రాతిపదికన మహిళాశక్తి భవన నిర్మాణ పనులు చేపట్టాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ తదితరులు

నిజామాబాద్‌అర్బన్: పండగ వాతావరణంలో పాఠశాలలను ఈనెల 12వ తేదీన పునఃప్రారంభించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుతో కలిసి మంత్రి సీతక్క వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బడి బాట, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థికి యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందించాలని, యూనిఫామ్ కుట్టిచ్చే బాధ్యతను మహిళా సంఘాలు సమర్థవంతంగా నిర్వహించాయని, ఇప్పటికే 90 శాతం వరకు స్టిచ్చింగ్ పూర్తయ్యిందని అభినందించారు. పాఠశాలలను శుభ్రం చేయించాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. విష సర్పాలు, క్రిమికీటకాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా అంగన్‌వాడీలను బలోపేతం చేయాలని, కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, రాష్ట్రంలో త్వరలో వెయ్యి అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించనున్నామని తెలిపారు.

మహిళా శక్తి భవనాలు..

మహిళా సమాఖ్య కార్యకలాపాల నిర్వహణ కోసం ఆయా జిల్లాల్లో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి, నవంబర్ లోగా పూర్తి చేసేలా చొరవ చూపాలని మంత్రి సీతక్క సూచించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని, ఇందులో భాగంగా మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ పంప్‌లు, రైస్ మిల్స్, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల స్థాపన, ఆర్టీసీ అద్దె బస్సులు నడపడం వంటి అనేక కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, డీపీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్, ఏపీడీ రవీందర్, ఐకేపీ డీపీఎం సాయిలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. నూతన బోధన పద్ధతులపై వేసవి సెలవుల్లో ఐదు రోజులపాటు ఉపాధ్యాయులకు విజయవంతంగా శిక్షణ అందించామని అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఏఐ టూల్స్ ద్వారా అందిస్తున్న ప్రాథమిక విద్య, డిజిటల్ తరగతులు, పాఠశాలల్లో వచ్చిన మార్పులను వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

అదును చూసి చదును చేస్తారు

- అటవీ శాఖ అప్రమత్తం అవ్వాల్సిందే..
- ఏటా వందల ఎకరాల్లో అడవుల ఆక్రమణ



అటవీభూమిని చదును చేసిన ట్రాక్టర్లను పట్టుకున్న అటవీ శాఖ సిబ్బంది (ఫైల్)

ఇందల్వాయి: వానాకాలం అటవీ భూముల ఆక్రమణకు అనువైన కాలమని, అధికారులు అప్రమత్తం కావాలని ప్రకృతి, పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. మే నెలలో విస్తారంగా కురిసిన వర్షాలతో అటవి భూములు చదును చేసేందుకు అనువుగా మారాయి. దీంతో గుట్టు చప్పుడు కాకుండా అడవులను ఆక్రమించేందుకు దుండగులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో భారీ విస్తీర్ణం(22,748 హెక్టార్లు)లో అడవులు ఉన్న ఇందల్వాయి రేంజ్‌లో ఆక్రమణలు ఎక్కువయ్యే అవకాశం ఉంది.

ఆక్రమణలు ఇలా..

వ్యవసాయ భూములకు ఆనుకొని ఉన్న అటవి భూములే ఎక్కువగా కబ్జాకు గురవుతున్నాయి. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, హద్దులు నిర్ధారణ కాకపోవడం, అటవీ భూముల చుట్టూ కందకాలు తవ్వించకపోవడంతో అటవీ పరిసర ప్రాంతాల రైతులు ఏటా కొద్దికొద్దిగా చెట్లను నరుకుతూ అటవీభూములను తమ భూముల్లో కలిపేసుకుంటున్నారు. అటవీశాఖ సిబ్బంది పర్యవేక్షణ కొరవడడం, చర్యలు, శిక్షలు కఠినంగా లేకపోవడంతో కబ్జాదారులు ఏ మాత్రం జంకులేకుండా దర్జాగా అడవులను ఆక్రమిస్తున్నారు.

పరిధి ఎక్కువ.. సిబ్బంది తక్కువ

ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ ఇందల్వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలాల్లో విస్తరించి ఉంది. 22 వేల హెక్టార్లలో అడవులను కాపాడేందుకు సరిపడా సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడుతోంది. రేంజ్‌లో 35 మంది బీట్ అధికారులు అవసరం కాగా కేవలం 16 మంది, ఆరుగురు సెక్షన్ అధికారులకు గాను ముగ్గురు మాత్రమే ఉన్నారు. సిబ్బంది లేమి కారణంగా పోడు పట్టాల మాటున సుమారు 80 ఎకరాల వరకు అటవీభూములు ఇందల్వాయి రేంజ్ పరిధిలో ఆక్రమనకు గురైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

కఠిన శిక్ష విధించాలి



కఠిన శిక్ష లేకపోవడంతో అక్రమార్కులు భయం లేకుండా అడవులను ఆక్రమిస్తున్నారు. రెవెన్యూ, ఫారెస్ట్ హద్దులను పక్కాగా గుర్తించి అడవుల చుట్టూ కందకాలు తవ్వించాలి. అందుకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతోపాటు అడవుల సంరక్షణకు అవసరమైన సిబ్బందిని నియమించాలి. అడవుల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించి అడవుల సంరక్షణలో వారిని భాగస్వాములను చేయాలి. – నోముల రాజులు, నల్లవెల్లి

పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాం



జిల్లాలోనే పెద్దదైన ఇందల్వాయి రేంజ్‌లో అడవులు కబ్జా కాకుండా కాపాడేందుకు యాక్షన్ ప్లాన్‌తో కృషి చేస్తున్నాం. ఉన్న సిబ్బందితో నిత్యం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. అడవులను చదును చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేయడమే కాకుండా, కబ్జాలకు ప్రయత్నిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. అడవులను ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటాం.
– రవి మోహన్‌భట్, ఎఫ్ఆర్వో, ఇందల్వాయి రేంజ్

బోధన్ కాంగ్రెస్ నేతల మూకుమ్మడి రాజీనామా



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఇంటి ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్
- హైదరాబాద్‌లో టీపీసీసీ చీఫ్ నివాసం ఎదుట నిరసన

బోధన్: మాజీ మంత్రి, సీనియర్ నేత బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అధిష్టానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పెద్ద సంఖ్యలో హైదరాబాద్ వెళ్లి టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ నివాసం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 31 మంది పార్టీ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేస్తూ పత్రాన్ని సమర్పించినట్లు నాయకులు వెల్లడించారు. అనంతరం మంగళవారం బోధన్ బంద్‌కు పిలుపు ఇచ్చి ఆ తర్వాత అనివార్య కారణాలతో విరమించుకుంటున్నట్లు ప్రకటించారు. టీపీసీసీ డెలిగేట్ బీ గంగాశంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలోపే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

‘దోస్త్’ ధ్రువపత్రాల పరిశీలన

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన వర్సిటీ అడ్మిషన్స్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎన్‌సీసీ 3, స్పోర్ట్స్ 4 ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులు పరిశీలనకు హాజరైనట్లు కోఆర్డినేటర్ డాక్టర్ వాసం చంద్రశేఖర్ తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ రామస్వామి, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత, టెక్నికల్ అసిస్టెంట్ నరేశ్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజావాణికి 135 ఫిర్యాదులు



నిజామాబాద్ అర్బన్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్‌లతోపాటు జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, ఏసీపీ వెంకటేశ్వర్‌రావుకు వివరించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

వింత దూడ జననం



బోధన్: పట్టణంలోని రాకాసీపేట ప్రాంత రైతు రాములుకు చెందిన గేదె రెండు తలలు, ఆరు కాళ్లు ఉన్న దూడకు జన్మనిచ్చింది. వింతగా దూడ జన్మించడంతో రాములు కుటుంబీకులు, కాలనీవాసులు ఆసక్తిగా తిలకించారు.

పిడుగుపాటుకు ఎలక్ట్రిక్ వస్తువులు ధ్వంసం



వర్ని: మండల కేంద్రంలోని మెహర్‌బాబా కాలనీకి చెందిన జైకర్ శివకుమార్ ఇంటి పిల్లర్‌పై సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో పిడుగుపడింది. దీంతో పిల్లర్ పూర్తిగా ధ్వంసం కాగా ఇంట్లో ఉన్న ఎలక్ట్రిక్ వస్తువులు ధ్వంసమయ్యాయి. చుట్టుపక్కల నాలుగు ఇళ్లలో కూడా విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమైనట్లు కాలనీవాసులు తెలిపారు. పిడుగుపాటు శబ్దానికి భయభ్రాంతులకు గురయ్యామన్నారు.

కొమ్మినేని అరెస్ట్ కక్ష సాధింపు చర్యే

- భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం
- సీనియర్ జర్నలిస్టుపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి
- ప్రజా సంఘాలు, 'సాక్షి' సిబ్బంది ధర్నా



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు, సాక్షి సిబ్బంది

నిజామాబాద్ లీగల్ : సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్ట్‌ను నిరసిస్తూ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ప్రజాసంఘాలు, సాక్షి సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త కార్యదర్శి వీ ప్రభాకర్ మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్ట్ కక్ష సాధింపు చర్య అని, రాజ్యాంగం అందించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో తనకు గిట్టని వారిపై కేసులు పెట్టి వేధించాడని, చంద్రబాబుకు ఇది కొత్తేమికాదన్నారు. చంద్రబాబు అరాచకాలపై జర్నలిస్టులు, ఇతర మీడియాహౌస్‌లు ఏకం కావాలని, లేకుంటే వారి పరిస్థితి సైతం ఇదే విధంగా అవుతుందని తెలిపారు. ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ సమితి జిల్లా చైర్మన్ సావెల్ గంగన్న మాట్లాడుతూ కొమ్మినేని అరెస్ట్ యావత్ మీడియాపై దాడిగా అభిప్రాయపడ్డారు. చర్చ సందర్భంగా చేసిన వ్యాఖ్యల ఆధారంగా అరెస్ట్ చేయడం తగదన్నారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా నాయకుడు బాబన్న మాట్లాడుతూ కొమ్మినేని అరెస్ట్ భావప్రకటన స్వేచ్ఛపై దాడిగా అభివర్ణించారు. ధర్నాలో సాక్షి బ్యూరో చీఫ్ తూమాటి భద్రారెడ్డి, అడ్వర్టైజింగ్ మేనేజర్ సంపత్, ఆర్‌సీ ఇన్‌చార్జీలు సంజీవ్, మురళి, విలేకరులు సుదర్శన్, రజినీష్, రాంచందర్, మోహన్, శ్యామ్ కుమార్, ఫొటోగ్రాఫర్ రాజ్‌కుమార్, సిబ్బంది దీక్షిత్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కును హరించొద్దు



భారత రాజ్యాంగం పౌరులకు ఆర్టికల్ 19(1)(ఏ) ప్రకారం తమ అభిప్రాయాలను, భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే హక్కు ఇచ్చింది. ప్రజలతోపాటు మీడియాకు ఈ హక్కు ఉంది. సాక్షి టీవీలో అమరావతిపై చర్చ సందర్భంగా, వ్యాఖ్యాత చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకొని కొమ్మినేని శ్రీనివాస్‌రావుని అరెస్ట్ చేయడం తగదు. – **ఆల్గోట్ రవీందర్,** న్యాయవాది, పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి

జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవికి అర్హత లేదా?

- ఇన్‌చార్జి మంత్రి నుడిగాలి పర్యటనలకే పరిమితం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు, మాజీ కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా.. ఇంతవరకూ జిల్లా నుంచి మంత్రి పదవి దక్కలేదని, మంత్రి పదవికి జిల్లా ఎమ్మెల్యేలకు అర్హత లేదా అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి ప్రశ్నించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి పదవి ఇవ్వకుండా కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమా ర్ గౌడ్, సీనియర్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని అవమానించిందని విమర్శించారు. ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సుడిగాలి పర్యటనలు తప్ప జిల్లా అభివృద్ధి మీద శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. జిల్లా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీలకు తామే పెద్దపీట వేశామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ.. మంత్రివర్గంలో ఎంతమందికి పదవులు ఇచ్చారో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి నిధులు రాకపోవడంతోనే జిల్లాలో ఆర్‌వోబీ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, గోపిడి స్రవంతి రెడ్డి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, డాక్టర్ కొండా ఆశన్న, పద్మారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత



చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): తప్పిపోయిన చిన్నారిని లింగంపేట పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన కొనసారి హేమలత ఆదివారం సాయంత్రం తన మూడేళ్ల కూతురితో లింగంపేటకు వచ్చింది. సరుకులు తీసుకునే క్రమంలో చిన్నారి తల్లి దగ్గర నుంచి తప్పిపోయింది. రాత్రి బస్టాండ్ ప్రాంతంలో చిన్నారి ఏడుస్తూ ఒంటరిగా ప్రయాణికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూకోల్ట్ సిబ్బంది దేవేందర్, కాశాగౌడ్ పాపను స్టేషన్‌కు తరలించి, ఫొటోను సామాజిక మాధ్యమంలో పెట్టారు. ఫొటో వైరల్ కావడంతో పొల్కంపేట వాసులు హేమలతకు సమాచారం ఇచ్చారు. పొల్కంపేట గ్రామస్తుల సమక్షంగా పోలీసులు పాపను తల్లికి అప్పగించారు.

దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు అందజేయనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్ బీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెట్రోఫిట్టెడ్ మోటారైజ్డ్ వెహికిల్, బ్యాటరీ వీల్ చైర్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో, హైబ్రీడ్ వీల్ చైర్, ల్యాప్‌టాప్, ట్యాబ్, స్మార్ట్ ఫోన్లు, మూడు చక్రాల రిక్షా, వీల్‌చైర్, చంక కర్రలు, చేతి కర్రలు తదితర ఉపకరణాలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ నెల 18లోపు https://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

స్నాతకోత్సవానికి రండి

- గవర్నర్‌ను ఆహ్వానించిన తెయూ వీసీ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో జూలై మూడో వారంలో జరిగే వర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం వీసీ రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య ద్వారానే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఇందుకు సాంకేతిక విద్యాభివృద్ధితోపాటు యూనివర్సిటీల్లో జరిగే మానవవనరుల అభివృద్ధి కూడా ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. ప్రధానంగా రాష్ట్రంలో ఉన్నత విద్యారంగ వికాసానికి ప్రాంతీయ యూనివర్సిటీలు నిర్మాణాత్మక కృషి చేయాలని సూచించారు. తెలంగాణ ప్రాంతంలో అనేక విలువైన సహజ వనరులు ఉన్నాయని, వాటిని వెలికి తీసే దిశగా వర్సిటీల్లో విభిన్న రంగాలలో లోతైన పరిశోధనలు జరగాలన్నారు. గవర్నర్ తెలంగాణ యూనివర్సిటీ పరిధి, విద్యాభివృద్ధిపై చర్చించి పలు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు వీసీ యాదగిరిరావు తెలిపారు.

కోడెల మృతిపై సీఎం స్పందించాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మహిళలతో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్సీ కవిత

ఇందల్వాయి: వేములవాడలో భక్తులు సమర్పించిన కోడెలు మృతి చెందితే కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇందల్వాయి గ్రామంలోని రామాలయంలో రూ. 5 లక్షలతో నిర్మించిన ఆలయ ప్రహరీని ఆమె సోమవారం ప్రారంభించారు. రామాలయాన్ని దూపదీప నైవేద్యం పథకంలో చేర్చేలా కృషి చేస్తానని అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేవాలయాలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేసిందన్నారు. వేములవాడలో కోడెల మృతిపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించి శ్రద్ధ తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆమె డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేశ్ నాయక్, నాయకులు కుమార్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాణాలు తీసుకున్న తండ్రీకొడుకులు

- దుబారా ఖర్చులు చేసి..
- మాణిక్‌భండార్‌లో ఘటన



సతీశ్ (ఫైల్)

మాక్లూర్: డబ్బులు ఉన్నప్పుడు దుబార ఖర్చులు చేశారు. కాలక్రమేనా.. కనీసం టీ తాగటానికి కూడా డబ్బులు లేక సతమతమయ్యారు. దానికి తోడు కొడుకు సతీశ్‌కు ఆరు నెలల క్రితం పక్షవాతం రావటంతో సేవలు చేయటానికి కూడా ఎవ్వరు లేకపోవడంతో.. 75 సంవత్సరాల వృద్ధుడైన తండ్రి ఆకుల చిన్న సాయిలు ఓపిక ఉన్నకాడికి సేవలు చేశాడు. చివరికి నీకు సేవలు చేయటం నాతో కావటం లేదు బిడ్డా... ఇక నేను ఏదైన మందు తాగి చచ్చిపోతాను అని తన అభిప్రాయాన్ని ఈ నెల 6 న కొడుకు సతీశ్‌తో చెప్పాడు. నీతోపాటు నేను కూడా అదే పని చేస్తా బాపూ అంటూ చెప్పి అదే రోజు విష గుళికలు తెప్పించుకుని నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం మాణిక్‌భండార్ గ్రామంలోని సొంత ఇంట్లోనే ఇద్దరూ కలిసి విషగుళికలు మింగారు. ఇద్దరూ వాంతులు చేసుకోవటంతో గమనించిన సాయిలు పెద్ద కుమారుడు సంతోష్ వెంటనే వారిద్దరిని ఆస్పత్రికి తరలించాడు. చికిత్సపొందుతూ సతీశ్ (32) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తండ్రి ఆకుల చిన్న సాయిలు (75) ఆదివారం మృతి చెందాడు. రెండ్రోజుల వ్యవధిలో తండ్రీకొడుకులు మృతి చెందటంతో మాణిక్‌భండార్ గ్రామంలో విషాదం నెలకొంది. వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన సుమారు రూ. 90 లక్షలకు పైగా డబ్బులను సతీశ్ దుబారాగా ఖర్చు చేశాడు. తీరా చేతిలో చిల్లి గవ్వకూడా లేకుండాపోయింది. పైగా సతీశ్ మూడు వివాహాలు చేసుకున్నప్పటికీ ఒక్క భార్య కూడా కాపురం చేయలేదు. దీంతో తీవ్రమన స్తాపానికి గురై గత సంవత్సరం తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. ఆరు నెలల క్రితం సతీశ్‌కు పక్షవాతం వచ్చి మంచం పట్టాడు. అప్పటి నుంచి తండ్రి సేవలు చేశాడు. డబ్బులు లేక ఆస్పత్రిలో వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది.

బీఎల్‌వోలకు గుర్తింపు కార్డులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌వో) గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఈ నెల 25వ తేదీ లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 1200 మందికిపైగా ఓటర్లు ఉన్న చోట కొత్తగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా గుర్తించిన పోలింగ్ కేంద్రాలతో కూడిన ప్రతిపాదనల జాబితాను ఈ నెల 20వ తేదీ లోగా పంపించాలని సూచించారు. అదేవిధంగా అవసరమైన చోట్ల కొత్తగా బూత్ లెవల్ అధికారులను నియమించాలని, వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా స్థానికులై ఉండాలని, ఒకవేళ అందుబాటులో లేని పక్షంలో అంగన్‌వాడీ కార్యకర్తలను నియమించ వచ్చన్నారు. ఎస్ఎస్ఆర్–2026 ప్రక్రియ కోసం చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, ఈ నెల 15వ తేదీలోగా తమకు వివరాలు సమర్పించాలని సీఈవో సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, సౌత్, నార్త్ తహసీల్దార్లు బాలరాజు, విజయ్‌కాంత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైల్వే గేట్‌మన్ బలవన్మరణం

నవీపేట: మండలంలోని మహంతం రైల్వేగేటు గేట్‌మన్ విజేంద్రకుమార్ బైర్వ(29) సోమవారం వేకువజామున గేట్‌రూమ్‌లో బలవన్మరణానికి పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రాజస్తాన్‌లోని దసువా గ్రామానికి చెందిన విజేంద్రకుమార్ కొంతకాలంగా మహంతం రైల్వేగేట్ గేట్‌రూమ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం వేకువజామున ఫ్యాన్ సీలింగ్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతికి గల కారణాలు తెలియలేదన్నారు.

పుల్కల్‌లో వివాహిత..



బిచ్కుంద: మండలంలోని పుల్కల్ గ్రామానికి చెందిన చాకలి సునీత(38) ఆదివారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సునీత భర్త గంగాధర్ కొంతకాలం క్రితం చనిపోవడంతో ఆర్థిక సమస్యలు పెరిగి నిత్యం ఆవేదనలో ఉండేదన్నారు. మగ దిక్కు లేదనే ఆవేదనతో కుటుంబపోషణ భారమై ఆత్మహత్యకు పాల్పడింది. మామ చాకలి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో మహిళ..

ఖలీల్‌వాడి: నగరంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన హోలియా లక్ష్మి అలియాస్ బాల్‌గిర్ లక్ష్మి(44) సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. లక్ష్మి ఇటీవల ఒక ఇంటిని కొనుగోలు చేసింది. ఇన్‌స్టాల్‌మెంట్‌లో భాగంగా కొడుకు రోహిత్ కొన్ని డబ్బులు పంపించాడు. మిగతా డబ్బులు పంపాలని అడగగా కొడుకు స్పందించలేదు. ఇన్‌స్టాల్‌మెంట్ డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో మనస్తాపానికి గురైన లక్ష్మి ఇంట్లో ఫ్యాన్‌కి చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

బోధన్ రూరల్ : మండలంలోని పెంటఖుర్దు గ్రామానికి చెందిన గార్ల నవీన్ (27) తన పొలంలో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నవీన్ పొలంలోని బోరు మోటారుకు సంబంధించిన విద్యుత్ తీగలు తెగిపోయాయి. సోమవారం విద్యుత్ తీగలు సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఆరేళ్ల కూతురు ఉంది.

మృతదేహం లభ్యం

బోధన్: నిజామాబాద్ నగరంలోని సంతోష్ నగర్ కాలనీకి చెందిన మధు అనే వ్యక్తి మృతదేహం ఎడపల్లి మండలం ఠానాకలాన్ గ్రామ శివారులో సోమవారం లభ్యమైంది. ఎస్సై వంశీకృష్ణా రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 7న పనికి వెళ్తానని భార్య రాధికతో చెప్పి బయటికి వెళ్లిన మధు తిరిగి రాలేదు. దీంతో ఐదో టౌన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. రాధిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైకు దొంగల అరెస్ట్

ఖలీల్‌వాడి: బైక్ దొంగతనాల కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. నగరంలోని మారుతీనగర్‌కు చెందిన శంకర్ ప్రసాద్ ఈ నెల 7న ఖలీల్‌వాడిలోని ఓ ఆస్పత్రి ఎదుట పార్క్ చేసిన బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం బోధన్ బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా రెండు వాహనాలను ఆపగా తప్పించుకోవడానికి ప్రయత్నించారు. పట్టుకొని విచారించగా కోటగిరి మండలం రచ్చపల్లి గ్రామానికి చెందిన తాటిగొల్ల గోపాల్, వెంగళ్‌రావు నగర్‌కు చెందిన అర్బాజ్ అలియాస్ జాఫర్ బైక్ దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. నిందితుల నుంచి మూడు బైకులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

దోపిడీ దొంగల ముఠా అరెస్ట్

- నిందితులు మహారాష్ట్రకు చెందిన పార్థీగ్యాంగ్ సభ్యులు
- నలుగురు అరెస్ట్, పరారీలో మరొకరు
- మారణాయుధాలు, సొత్తు రికవరీ
- అదనపు ఎస్పీ నరసింహారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

కామారెడ్డి క్రైం: ఆరు నెలలుగా కత్తులతో బెదిరించి జాతీయ రహదారుల వెంబడి దోపిడీలు, తాళం వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ నేరాలకు పాల్పడుతున్న మహారాష్ట్రకు చెందిన పార్థీ గ్యాంగ్ ముఠాను గాంధారి పోలీసులు పట్టుకున్నారు. పలు కేసుల్లో నిందితులుగా ఉన్న నలుగురిని అరెస్ట్ చేయగా, మరొకరు పరారీలో ఉన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి వివరాలు వెల్లడించారు. ఇటీవల గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఓ దోపిడీ కేసు నమోదైంది. ఇలాంటి కేసులు క్రమం తప్పకుండా నమోదు అవుతుండటంతో ఎస్పీ రాజేశ్ చంద్ర సూచన మేరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో దొంగలను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, కొన్ని ఆధారాలతో దర్యాప్తు వేగవంతం చేసి నిందితులను పార్థీ గ్యాంగ్ ముఠాగా గుర్తించారు. సోమవారం గాంధారి మండలం మొండిసడాక్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాదంగా కనిపించడంతో పట్టుకున్నారు. వారిని విచారించగా దొంగతనాల వ్యవహారం బయటపడింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ముఖేడ్ ప్రాంతానికి చెందిన నాందేవ్ అలియాస్ రామక్రిష్ణ భోంస్లే, భాస్కర్ చౌహాన్, క్రిష్ణబాబు షిండే, రాథోడ్ అజిత్ రమేశ్ ముఠాగా ఏర్పడి దారి దోపిడీలు, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తున్నారు. వారికి గజానంద్ రామారావు ఆడె అనే వ్యక్తి రిసివర్‌గా వ్యవహరిస్తున్నాడని విచారణలో తేలింది. నిందితుల్లో భాస్కర్ చౌహాన్ పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని అరెస్ట్ చేశారు. 3 తులాల బంగారం, 12 తులాల వెండి ఆభరణాలు, 2 కత్తులు, ఇనుప రాడ్లు, టార్చిలైట్లు, ఇతర వస్తువులు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కామారెడ్డి జిల్లాలోని గాంధారి, బాన్సువాడలో 9 కేసులు ఉండగా నిజామాబాద్, నిర్మల్ పోలీస్ స్టేషన్‌లలో కూడా పదుల సంఖ్యలో కేసులు ఉన్నట్లు తెలుస్తుందని ఏఎస్పీ తెలిపారు. మహారాష్ట్రలోని ఉద్గీర్ రూరల్, నీలంగా పీఎస్‌లలో హత్య, హత్యాయత్నం కేసులు నమోదైనట్లు వెల్లడించారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని పేర్కొన్నారు. కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ సీఐ శ్రీనివాస్, సదాశివనగర్ సీఐ సంతోష్ కుమార్, ఎస్సైలు ఆంజనేయులు, రంజిత్, ఉస్మాన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది గణపతి, శ్రీనివాస్, రాజేందర్, శ్రావణ్, లక్ష్మీకాంత్, స్వామి, మైసయ్య, రవిలను అభినందించారు.

మోసగించిన యువతి రిమాండ్

- రూ. 3 లక్షల 80 వేలు స్వాధీనం



రికవరీ చేసిన డబ్బులతో సీఐ వెంకట నారాయణ

బోధన్‌టౌన్(బోధన్): అనాథనని నమ్మించి దంపతుల అకౌంట్‌లో నుంచి రూ. 7,49,500 కాజేసిన యువతిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలి వద్ద నుంచి రూ. 3 లక్షల 80 వేలు సాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ వెంకట్ నారాయణ వివరాలు వెల్లడించారు. ఏపీలోని గుంటూరుకు చెందిన పబ్బులేటి సోని ప్రత్యూష గత నెల 30న బోధన్ పట్టణానికి వచ్చింది. యూనియన్ బ్యాంకులో నాగన్‌పల్లికి చెందిన శ్రీనివాస్ దంపతులకు తాను అనాథనని, నా అకౌంట్ పనిచేయడం లేదని, అకౌంట్లో రూ.10 లక్షలు వరకు ఉన్నాయని అవి మీ అకౌంట్లో వేస్తా తీసి ఇవ్వాలని కోరింది. అందుకు దంపతులు ఒప్పుకొని, రాత్రి యువతిని వారి ఇంటికి తీసుకెళ్లారు. అకౌంట్లో డబ్బులు వేస్తా.. వివరాలు ఇవ్వాలని అడగగా, శ్రీనివాస్ భార్య అకౌంట్ నంబర్, ఏటీఎం కార్డు, పిన్ నంబర్‌తోపాటు సిమ్ కార్డు ఇచ్చారు. దీంతో వారికి తెలియకుండా అకౌంట్ నుంచి రూ. 7లక్షల 49 వేల 500లు తన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకొని, ఉదయం ఐరేండ్ల నరేశ్ అనే వ్యక్తి సహాయంతో బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసుకొని పారిపోయింది. శ్రీనివాస్ దంపతులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరారైన యువతిని సోమవారం పట్టుకొని రూ. 3 లక్షల 80 వేల నగదుతోపాటు మూడు ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. గతంలో నిజామాబాద్‌లోని త్రిటౌన్, నందిగామ, సైబరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదాపూర్‌లో ఇదే తరహా చీటింగ్‌కు పాల్పడి సోని ప్రత్యూష జైలుకు వెళ్లిందని సీఐ తెలిపారు. బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఇతరులను నమ్మొద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పుప్పాల బుచ్చక్క(108) సోమవారం మృతి చెందింది. వారం రోజుల క్రితం వరకు ఎవ్వరిపై ఆధారపడకుండా ఆమె పనులు ఆమెనే చేసుకుంది. బుచ్చక్కకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉండగా, ఆమె మూడు తరాల వారిని చూసింది.

డిక్కీలోంచి రూ.లక్ష మాయం

బాన్సువాడ : బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామానికి చెందిన బొప్పిడి సాయిరెడ్డి అనే వ్యక్తి స్కూటీ డిక్కీలోంచి రూ. లక్ష మాయమైనట్లు సీఐ అశోక్ తెలిపారు. సోమవారం యూనియన్ బ్యాంకులో సాయిరెడ్డి రూ.లక్ష నగదు డ్రా చేసుకొని స్కూటీ డిక్కీలో పెట్టి డెయిలీ మార్కెట్‌లో కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చి చూడగా డిక్కీలో ఉండాల్సిన రూ. లక్ష నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనుమడు మృతి

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ గ్రామస్తుల ఆందోళన





సిద్ధిరాములు, శేయాంక్ (ఫైల్)

రాజంపేట : మండల కేంద్ర సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం (టీవీఎస్ ఎక్సెల్) ఢీకొని తాత, మనుమడు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బస్వన్నపల్లికి చెందిన సిద్ధిరాములు(50), మనుమడు శేయాంక్(4) టీవీఎస్ ఎక్సెల్‌పై రాజంపేటలోని పీహెచ్‌సీకి వెళ్తున్నారు. గుండారం నుంచి కామారెడ్డికి వస్తున్న ఆర్టీసీ బస్సు రాజంపేట సమీపంలో టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొట్టింది. దీంతో ఎక్సెల్‌పై ఉన్న ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న బస్వన్నపల్లి గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై ఆందోళన చేశారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. కామారెడ్డి డిపో సీఐ లింగమూర్తి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కామారెడ్డి ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.